క్లుప్తంగా

నేడు వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం

పామర్రు: వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం బుధవారం స్థానిక మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు కార్యాలయ సిబ్బంది మంగళవారం తెలిపారు. ఉదయం 8.30 నిముషాలకు ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ఉదయం 9.30 గంటలకు కూటమి ప్రభుత్వం విద్యార్థులకు చేస్తున్న అన్యాయాన్ని నిరసిస్తూ కృష్ణాజిల్లా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిర్వహించే 'యువత పోరు' కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ పాల్గొంటారని తెలిపారు. నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ నాయకులు కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, అభిమానులు, విద్యార్థులు ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

సుబ్బారాయుడికి అభిషేకాలు



ముదినేపల్లి రూరల్: సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్‌లోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో స్వామికి మంగళవారం అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు తోలేటి వీరభద్రశర్మ ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు, ఇతర కార్యక్రమాలు నిర్వహించి అభిషేకాలు చేశారు. ఈ అభిషేకాలు చేయించుకునేందుకు సుదూర ప్రాంతాల నుంచి అనేక మంది భక్తులు ఆలయానికి చేరుకున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా నిత్యాన్నదాన ప్రసాదానికి సంబంధించి అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. ఆలయ ఈఓ ఆర్.గంగాశ్రీదేవి పర్యవేక్షణ చేశారు.

సింహవాహనంపై వేణుగోపాలుడు

ముదినేపల్లి రూరల్: మండలంలోని గురజ శ్రీరుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయ వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం సింహవాహనంపై స్వామి, అమ్మవార్ల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ఉదయం హోమం, ఊరేగింపు అనంతరం వైఖానస సాంప్రదాయ ప్రకారం సింహవాహనంపై రుక్మిణీ, సత్యభామ సమేతుడైన వేణుగోపాలస్వామిని సింహవాహనంపై గ్రామంలో ఊరేగించారు. ఈ సందర్భంగా స్వామికి ఇంటింటా భక్తులు హారతులు ఇచ్చి పూజలు నిర్వహించారు. ఆలయ కార్య నిర్వహణాధికారి శింగనపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అర్చకుడు తేజోరామ్, ఆగమశాస్త్ర పండితుడు విజయవాడకు చెందిన పరశారామ్ శ్రీరంగానాథాచార్యులు ఆధ్వర్యంలో హోమాలు, అభిషేకాలు నిర్వహించారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన



గుడ్లవల్లేరు: అంగన్‌వాడీ పిల్లల నైపుణ్యతకు ఎర్లీ చైల్డ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ (ఈసీసీఈ) ముఖ్య ఉద్దేశమని ఐసీడీఎస్ గుడివాడ సీడీపీఓ ఎ.విజయ ఫ్లోరెన్స్ అన్నారు. అంగలూరులో మంగళవారం అంగన్‌వాడీలకు నిర్వహించిన పోషణా భీ పడాయి భీ సమావేశంలో ఆమె మాట్లాడారు. దీనిపై ఈ నెల 11నుంచి 13వ తేదీ వరకు అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన సదస్సులను ఏర్పాటు చేశామన్నారు. పిల్లల్లో మానసిక, శారీరిక, భాషా, సాంస్కృతికను పెంపొందించడమే ఈ కార్యక్రమ ఉద్దేశమని తెలిపారు. ఏసీడీపీఓ పద్మావతి, సూపర్‌వైజర్ వాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాలు

ముదినేపల్లి రూరల్: మండలంలోని క్లస్టర్ కాంప్లెక్స్‌లలో సమావేశాలు బుధవారం నిర్వహిస్తారు. ఇందుకు సంబంధించి విద్యాశాఖ అధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సమావేశాలు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జరుగుతాయి. ఉపాధ్యాయులు 12 గంటల లోపు విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం పెట్టించి ఇంటికి పంపాల్సి ఉంటుంది. బుధవారం ఒక్కపూట మాత్రమే పాఠశాలలు పని చేస్తాయి. పలు పరీక్షల డ్యూటీలో ఉన్నవారు డ్యూటీ ముగిసిన తరువాత సమావేశాలకు విధిగా హాజరుకావాల్సి ఉంటుంది. సమావేశాలకు హాజరయ్యే ఉపాధ్యాయులు తాము బోధించే తరగతులకు సంబంధించే గత సమావేశాల అనంతరం నిర్వహించిన పరీక్షల మార్కుల వివరాలు, విద్యార్థుల హాజరు, ఇతర వివరాలతో హాజరుకావాల్సి ఉంటుంది.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



కైకలూరు: స్థానిక నిమ్మగడ్డ నాగభూషణం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 137 మంది పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి ప్యాడ్, పెన్నులను వశిష్ఠ మహిళా సంక్షేమ అభివృద్ధి సంస్థ మంగళవారం పంపిణీ చేసింది. సంస్థ నిర్వాహకులు నడింపల్లి లక్ష్మీసత్యనారాయణ, దేవీ మాట్లాడుతూ విద్యార్థులు ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలన్నారు. ఉపాధ్యాయులు సుభాషిణి, అజయ్, శ్రీవల్లి, సురేష్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు రక్షణ కరువు

ఎండలతో అస్వస్థతకు గురవుతున్న కూలీలు



పామర్రులో జరుగుతున్న ఉపాధి పనులు

పామర్రు: మార్చి రెండో వారంలోనే మండుతున్న ఎండలతో ఉపాధి కూలీలు విలవిల్లాడుతున్నారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా నియోజకవర్గంలో పామర్రు తదితర గ్రామాల్లో ఉపాధి పనులు నిర్వహిస్తున్నారు. తాగునీటి చెరువుల తవ్వకాలు ప్రారంభించారు. అయితే ఎండల తీవ్రంగా ఉన్నాయి. అయితే అందుకు అనుగుణంగా రక్షణ ఏర్పాట్లు చేయడంలో అధికారులు విఫలమయ్యారనే ఆరోపణలున్నాయి. దీనికి తోడు ప్రభుత్వం కొత్త నిబంధనలు తీసుకురావడంతో కూలీలు అస్వస్థతకు గురవుతున్నారు. రెండు పూటలా ఫొటోలు తీసి మస్టరు నమోదు చేయాలంటూ మెలిక పెట్టడంతో అధికారులు ఇబ్బందులు పడుతున్నారు.

పెరిగిన ఎండలతో పోటీ విధానాన్ని మార్చాలని కూలీలు డిమాండ్ చేస్తున్నా స్థానిక సిబ్బంది తామేమీ చేయలేమంటూ చేతులెత్తేస్తున్నారు. నియోజకవర్గం మొత్తం ఇదే పరిస్థితి నెలకొంది. పామర్రు మండలం రిమ్మనపూడి గ్రామంలో నిర్వహిస్తున్న ఉపాధి పనుల తవ్వకాల్లో ఫీల్డు అసిస్టెంట్ రమేష్ అస్వస్థతకు గురై ఆస్పత్రిలో మృతి చెందాడు. వేసవిలో రక్షణ చర్యలు చేపట్టక పోవడంతో ఇబ్బందులు పడాల్సి వస్తుందని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డిమాండ్లు ఇవీ..

పని ప్రాంతంలో నీడ కోసం టెంట్‌లు వేయించాలి. తాగునీరు, మజ్జిగ ఏర్పాటు చేయాలి. ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందుబాటులో ఉంచాలి. రెండు పూటలా ఫొటో విధానాన్ని రద్దు చేసి, ఉదయం 10.30 గంటలకే పని పూర్తి చేసే విధంగా నిబంధనలు సడలించాలి.

ఫొటో విధానం మార్చాలి



ఎండల తీవ్రత ముందుగానే రావడంతో వేసవి రక్షణ చర్యలు చేపట్టాలి. రెండు పూటలా ఫొటో విధానంలో మార్పు రావాలి. తీవ్ర అస్వస్థతకు గురైన కుటుంబానికి రూ.5లక్షల ఎక్స్ గ్రేషియా ప్రకటించాలి.

– గంగాధర ప్రసాద్, సీఐటీయూ నాయకుడు, పామర్రు

కూలీలు ఇబ్బందులు పడుతున్నారు



వారం రోజులుగా ఎండల తీవ్రత పెరిగింది. పనులు చేయడానికి కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. టెంట్ వేయటం, చల్లటి నీరు.మజ్జిగ పంపిణీ వంటిని ప్రారంభించాలి. కూలీలు ఎండ బారిన పడకుండా చర్యలు తీసుకోవాలి.

– వెంకమ్మ, పామర్రు

యువతను మోసం చేసిన కూటమి ప్రభుత్వం



పోస్టర్లు ఆవిష్కరించిన వైఎస్సార్ సీపీ నాయకులు

గుడివాడ టౌన్: మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం విద్యార్థులను, యువతను మోసం చేసిందని వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. స్థానిక ఆంజనేయపేటలోని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మండలి హనుమంతరావు కార్యాలయంలో మంగళవారం యువత పోరు పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎన్నికల హామీలు అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను కూటమి ప్రభుత్వం మోసం చేస్తోందని విమర్శించారు. వైఎస్సార్ సీపీ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద, మధ్యతరగతి కుటుంబాలు బాగుపడాలంటే విద్య ద్వారానే అది సాధ్యమౌతుందని గుర్తించి ప్రాథమిక పాఠశాల నుంచి ఉన్నత విద్యవరకు వారికి అండగా ఉన్నారన్నారు. అమ్మ ఒడి, ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన వంటి పథకాలు అమలు చేసి పేద విద్యార్థులను విద్యావంతులుగా చేసేందుకు ఐదేళ్ల కృషి చేశారన్నారు. గత ఎన్నికల్లో విద్యార్థులను, విద్యార్థుల తల్లిదండ్రులను, యువతను మభ్యపెట్టే మాటలతో మోసం చేసి ఓట్లు దండుకుని గెలిచిన కూటమి ప్రభుత్వం వారికి అండగా ఉండకపోగా వారికి చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్, ఇతర సౌకర్యాలు నిలిపివేయడంతో విద్యార్థులు అయోమయంలో పడ్డారన్నారు. వారికి కళాశాల ఫీజులు కట్టలేక తల్లిదండ్రులు అప్పులపాలవుతున్నారన్నారు. దీంతో పాటు నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి ఇస్తామని మోసం చేశారన్నారు. దీనిపై తమ నాయకుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు యువత పోరు చేపట్టామని ఈ నెల 12వ తేదీ మచిలీపట్నంలో ధర్నా నిర్వహించి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామన్నారు. నిరుద్యోగ యువత, ఫీజు రీయింబర్స్‌మెంట్ అందని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మండలి హనుమంతరావు, జిల్లా అధికార ప్రతినిధి ఎంవీ నారాయణరెడ్డి, సీనియర్ నాయకుడు పాలేటి చంటి, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు మెరుగుమాల కాళీ, ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి తులిమిల్లి యెషయ్య, ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకుడు వెంపటి సైమన్, రూరల్ మండల అధ్యక్షుడు మట్టా జాన్ విక్టర్, మైనార్టీ కార్పొరేషన్ మాజీ డైరక్టర్ షేక్ సయ్యద్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ బాజీ, కె. ఆంజనేయ ప్రసాదు, చుండూరి శేఖర్, తోట రాజేష్, మామిళ్ల ఎలీషా, మహిళా విభాగం అధ్యక్షురాలు మాదాసు వెంకటలక్ష్మీ కుమారి, మహిళా కార్యకర్తలు సురేఖ, సునీత, రమీజ, మూడెడ్ల ఉమ, హారిక పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ చార్జీలు వెంటనే తగ్గించాలి



కరెంట్ బిల్లులు దగ్ధం చేస్తున్న సీపీఎం నాయకులు

గుడివాడ టౌన్: పేదలకు భారంగా మారిన పెంచిన విద్యుత్ చార్జీలు వెంటనే తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్‌సీపీ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఎన్టీఆర్ కాలనీలో ప్రజా సమస్యల చైతన్య యాత్ర నిర్వహించారు. విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ కరెంట్ బిల్లులు దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆర్‌సీపీ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ప్రజలు ఉపాధి కోల్పోయారన్నారు. బతకడమే కష్టంగా ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో పెంచిన కరెంట్ బిల్లులు చెల్లించడం వారికి భారంగా మారిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రూ. 16 వేల కోట్ల భారాన్ని ప్రజలపై మోపిందన్నారు. తక్షణమే వాటిని తగ్గించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఆర్. కొండ, ఎల్. సురేంద్ర, కృష్ణ కిషోర్, కె. నాగేశ్వరరావు, ఐద్వా కార్యదర్శి పి. రజిని తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి



సత్యనారాయణను సత్కరిస్తున్న డీఎన్నార్



చార్లీస్‌ను సత్కరిస్తున్న డీఎన్నార్

కైకలూరు: క్షేత్ర స్థాయిలో వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలని నూతనంగా నియమితులైన నాయకులకు ఆ పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) కోరారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర వాణిజ్య విభాగ సెక్రటరీగా ముదినేపల్లి మండల ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణను వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నియమించారు. దీంతో మంగళవారం కైకలూరు పార్టీ కార్యాలయం వద్ద పదవి రావడానికి కృషి చేసిన డీఎన్నార్‌కు ఎంపీపీ కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా కైకలూరు నియోజకవర్గ అనుబంధ విభాగాల్లో యూత్ వింగ్ అధ్యక్షుడిగా ఎన్నికైన ముండ్ర చార్లీస్‌ను డీఎన్నార్, పలువురు నాయకులు అభినందించారు.

ఫీల్డు అసిస్టెంట్ మృతి



రిమ్మనపూడి(పామర్రు): ఉపాధి హామీ పథకంలో ఫీల్డు అసిస్టెంట్‌గా రిమ్మనపూడిలో విధులు నిర్వహిస్తున్న గుర్విందపల్లి రమేష్(38) మంగళవారం మృతి చెందారు. రిమ్మనపూడి గ్రామానికి చెందిన రమేష్ ఉదయం ఫీల్డు అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న సమయంలో ఒక్కసారిగా తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. స్థానికులు అతడ్ని దగ్గరలో ఉన్న హాస్పిటల్‌కు తరలించారు. అక్కడి వెళ్లిన కొంత సేపటికే రమేష్ మృతి చెందాడు. రమేష్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్నారు. రమేష్ మృతదేహానికి నివాళులర్పించి, కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు తలారి మహేశ్ పాల్గొన్నారు.

చెత్త రహిత గ్రామాలుగా తీర్చిదిద్దండి

ఐసీడీఎస్ పీడీ ఎంఎస్ రాణి



హనుమంతపురంలో వర్మీకంపోస్టు తయారీని పరిశీలిస్తున్న పీడీ రాణి

పమిడిముక్కల: ప్రతి రోజూ తడి, పొడి చెత్తను సేకరించి, చెత్త రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని ఐసీడీఎస్ పీడీ, మండల ప్రత్యేకాధికారి ఎంఎస్ రాణి తెలిపారు. మండలంలోని హనుమంతపురంలో ఎంపీడీఓ దేవరపల్లి వెంకటేశ్వరరావుతో కలిసి మంగళవారం పర్యటించారు. చెత్త సేకరణపై ప్రజల అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో వర్మీకంపోస్టు తయారీ విధానాన్ని పరిశీలించారు. అంగనవాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. పీ4 సర్వేను పక్కాగా నిర్వహించాలని, వేసవిలో తాగునీటి ఇబ్బందులు రాకుండా చూడాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కలపాల రాంబాబు, కార్యదర్శి లక్ష్మి పాల్గొన్నారు.

వీరాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

పామర్రు: ఉండ్రపూడి–పోలవరం అడ్డరోడ్డు వద్ద ఉన్న వీరాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి విశేషంగా పంచామృతాలతో అభిషేకాలను నిర్వహించారు. పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకులు అగ్నిహోత్రం రామాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈఓ ప్రసాద్ పాల్గొన్నారు.

డాక్టర్ నోరి దత్తాత్రేయుడి సేవలు ఆదర్శం



దత్తాత్రేయుడు రచించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాయిబాబు, శ్రీనివాసరావు

పమిడిముక్కల: మారుమూల గ్రామమైన తాడంకి(మంటాడ) గ్రామంలో జన్మించి, ప్రపంచానికి సేవలందించిన ప్రముఖ క్యాన్సర్ వైద్యులు, ప్రభుత్వ సలహాదారు నోరి దత్తాత్రేయుడు తెలుగువారు కావడం మనకు గర్వకారణమని కెనరా బ్యాంక్ మాజీ జీఎం పులి సాయిబాబు, మంటాడ సర్పంచ్ ఎన్.వీరమ్మ పేర్కొన్నారు. అమెరికా వెళ్లి అంచెలంచెలుగా ఎదిగి, 50 ఏళ్లుగా క్యాన్సర్ రోగులకు సేవలిందించడం ఆదర్శనీయమన్నారు. దత్తాత్రేయుడు మంగళవారం మండలంలోని మంటాడ, తాడంకి గ్రామాల్లో పర్యటించారు. మంటాడ వెంకటేశ్వరస్వామి దేవస్థానికి వెళ్లి స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. గ్రామంలోని గీతామందిరానికి వెళ్లి స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దత్తాత్రేయుడు రచించిన మంటాడ టు మ్యాన్‌హ్యాటన్ పుస్తకాన్ని కెనరా బ్యాంక్ మాజీ జీఎం సాయిబాబు, మాజీ సర్పంచ్‌లు కుమ్మరరామారావు, జక్కా శ్రీనివాసరావులు ఆవిష్కరించారు.

ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి

కురుమద్దాలి(పామర్రు): ఏపీని ఆరోగ్యాంధ్ర ప్రదేశ్‌గా తీర్చి దిద్దటానికి తన వంతు కృషి చేస్తానని ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణులు ఏపీ ప్రభుత్వ వైద్య సలహాదారు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు వెల్లడించారు. మండలంలోని కురుమద్దాలిలోని ఏపిచ్చమ్మ తల్లి ఆశ్రమంలో మంగళవారం ఆయన ప్రత్యేక పూజలను చేశారు. ఆయన రచించిన 'మంటాడ టు మ్యాన్ హ్యాటన్ పుస్తకాన్ని ఆశ్రమంలోని పిచ్చమ్మ తల్లి వద్ద ఉంచి పూజాధికాలను నిర్వహించారు. కృష్ణాజిల్లా రచయిత సంఘ కార్యదర్శి పీఎంఎస్ ప్రసాద్, ఆశ్రమం నిర్వాహకులు కొసరాజు తులసి, ఆలయ అర్చకులు తోలేటి పిచ్చేశ్వరరావు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నాట్యప్రదర్శన



గొల్ల కలాపంలో కళాకారులు



డాక్టర్ బిందు అభినయ్ బృందం

కూచిపూడి(మొవ్వ): శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత రామలింగేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాల సందర్భంగా వేదాంతం రాధేశ్యాం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ఆలయం వద్ద గల శ్రీ సిద్ధేంద్ర యోగి కళావేదిక పై నెమ్మలూరు చంద్రశేఖర్ భాగవతార్ భక్త సిరియాళ హరికథా గానం అలరించింది. కళా నృత్యనికేతన్ స్కూల్ ఆఫ్ కూచిపూడి డాక్టర్ బిందు అభినయ్ బృందం జతీశ్వరం, రామాయణ శబ్దాలకు, నాట్యాచార్య ఏలేశ్వరపు వెంకటేశ్వర్లు శివాష్టకం, దివెలసంధ్య శిష్య బృందం జతిస్వరం, కొండలలో నెలకొన్న అనే అన్నమాచార్య కీర్తనలకు ప్రదర్శించి భక్తి భావాన్ని పరమళింప జేశారు. నెల్లూరుకు చెందిన గీతా కృష్ణ తదితర బృందాలు ప్రదర్శించిన గొల్ల కలాపం తదితర నృత్య రూపకాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గొల్లభామగా వేదాంతం సిద్ధేంద్ర వరప్రసాద్ (దూరదర్శన్ గ్రేడ్ ఆర్టిస్ట్), సూత్రధారిగా డాక్టర్ వేదాంతం రాధేశ్యాం తమ పరిధి మేరకు నర్తించి ఆహూతులను అలరింపజేశారు. చివరిగా కళాకారులను, నాట్యాచార్యులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి



బీసీ హాస్టల్ విద్యార్థులతో బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ రమేష్

కూచిపూడి(మొవ్వ): పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణతను సాధించి చదివే పాఠశాలలకు, హాస్టల్‌కు మంచి పేరు తీసుకు రావాలని కృష్ణా జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ జి.రమేష్ సూచించారు. మొవ్వ మండలంలోని కూచిపూడిలోని బీసీ బాలిక హాస్టల్, మొవ్వ గ్రామంలోని బీసీ బాలుర హాస్టల్‌ను మంగళవారం అవనిగడ్డ డివిజన్ వెల్ఫేర్ ఆఫీసర్ దివ్యతో కలిసి పరిశీలించి పదో తరగతి చదివే పిల్లలకు సూచనలు ఇచ్చారు. ముందుగా కూచిపూడి శ్రీ సిద్ధేంద్ర జిల్లా పరిషత్ ఓరియంటల్ హైస్కూల్, మొవ్వ శ్రీ మండవ కనకయ్య జెడ్పీ హై స్కూల్‌ను సందర్శించారు.

కల్యాణం.. కమనీయం



కొల్లేటికోటలో నిర్వహిస్తున్న జలదుర్గా, గోకర్ణేశ్వరుల దివ్య కల్యాణం

కైకలూరు: కొల్లేటికోట పెద్దింట్లమ్మ జాతరలో ప్రధాన ఘట్టమైన జలదుర్గ, గోకర్ణేశ్వరుల దివ్య కల్యాణం సోమవారం అర్ధ రాత్రి ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయానికి మూడు కిలోమీటర్ల దూరంలోని గోకర్ణపురం నుంచి గోకర్ణేశ్వర స్వామిని పల్లకీలో ఊరేగించుతూ అమ్మవారి దేవస్థానం వద్దకు మేళతాళాలతో తీసుకొచ్చారు. ఆలయ ఈఓ కూచిపూడి శ్రీనివాసు కల్యాణ క్రతువు నిమిత్తం పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు పేటేటి పరమేశ్వరశర్మ దంపతులు కల్యాణాన్ని నిర్వహించారు. కైకలూరు సర్కిల్ సీఐ వి.రవికుమార్ ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు నిర్వహించారు. మంగళవారం అమ్మవారికి శ్రీచక్రార్చన, త్రిశూల స్నానం, పాత్ర సాధన, పంచహారతులు అందించారు. అమ్మవారికి వస్త్ర, పుష్పాలంకరణ, ఉచిత ప్రసాద దాతలుగా దొడ్డిపట్ల గ్రామానికి చెందిన గొట్టుముక్కల శివరామరాజు, భుజబలపట్నం గ్రామానికి చెందిన ముదునూరి కొండరాజు దంపతులు వ్యవహరించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా బాల నాగమ్మ పౌరాణిక నాటకం ఆకట్టుకుంది. ఈ నెల 13న అమ్మవారికి తెప్పోత్సవం నిర్వహిస్తామని ఈఓ తెలిపారు.

లక్ష్మీనృసింహస్వామికి ఎమ్మెల్యే కామినేని పూజలు



కైకలూరు: వరహాపట్నం భూసమేత లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. రాత్రి స్వామి దివ్య కల్యాణం నిర్వహించారు. స్వగ్రామంలో నిర్వహించిన కార్యక్రమానికి వంశ పారంపర్య ధర్మకర్తలుగా ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ హాజరయ్యారు. స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈఓ వీఎస్‌కే శేఖర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.


వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

ముదినేపల్లి రూరల్: హేళనగా ఎందుకు మాట్లాడుతున్నారని ప్రశ్నించిన వ్యక్తిపై ఇద్దరు దాడి చేసిన ఘటన మండలంలోని సింగరాయపాలెంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు గ్రామానికి చెందిన కొరగంటి దుర్గారావు కోత మిషన్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 9న గ్రామంలో కొంతమంది వ్యక్తులు క్రికెట్ ఆడుతున్నారు. అటుగా వెళ్లిన దుర్గారావును అన్నదమ్ములైన దారపు వంశీ, సంతోష్ హేళనగా మాట్లాడారు. ఎందుకు హేళనగా మాట్లాడుతున్నారని దుర్గారావు ప్రశ్నించగా అన్నదమ్ములు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. దుర్గారావు గుడివాడ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా హాస్పిటల్ సిబ్బంది నుంచి వచ్చిన సమాచారం మేరకు ఎస్ఐ వీరభద్రరావు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రేషన్ డీలర్‌పై కేసు నమోదు

యలమర్రు(పెదపారుపూడి): మండలంలోని యలమర్రులోని రేషన్ షాపులో నిల్వలు ఎక్కువగా ఉండటంతోపాటు ఎండీయూ వాహనంలో ఉండాల్సిన సరుకు లేకపోవటంతో మంగళవారం అధికారులు కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రంగారావు మాట్లాడుతూ గ్రామంలోని డీలర్ అందండ కుమార్ రేషన్‌షాపులో ఉండాల్సిన బియ్యం కంటే తక్కువగా ఉన్నట్లు గుర్తించామన్నారు. పంచదార పంపిణీ చేసినట్లు చూపించారని, అయితే 73 ప్యాకెట్స్ షాపులో నిల్వ ఉండటం గుర్తించామన్నారు. ఎండీయూ వాహనదారుడు కాటూరి నవీన్ వాహనంలో ఉండాల్సిన సరుకు లేదని తెలిపారు. దీంతో డీలర్, ఎండీయూ వాహనదారుడిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఘనంగా లూర్దుమాత ఉత్సవాల ముగింపు



నందివాడ: మండలంలోని వెన్ననపూడి గ్రామంలో మూడు రోజులుగా జరుగుతున్న లూర్దుమాత ఉత్సవాల ముగింపు వేడుకల్లో ఎమ్మెల్యే రాము మంగళవారం రాత్రి పాల్గొన్నారు. ఫాదర్ కరుణాకర్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సభలో ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ లూర్దుమాత ఉత్సవాల్లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు దానేటి సన్యాసిరావు, నాయకులు జగన్మోహన్‌రావు, రవి, వేణు, ఏసుపాదం, రాధాకృష్ణ పాల్గొన్నారు.

ఫైలేరియా నివారణ కిట్ల పంపిణీ

కైకలూరు: ఫైలేరియా నివారణ కిట్లు పంపిణీ చేశామని హెల్త్ సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాస్ తెలిపారు. కొల్లేటికోట పీహెచ్‌సీతో పాటు ఆటపాక–1, 2 సచివాలయ పరిధిలో మంగళవారం పర్యటించారు. నలుగురు ఫైలేరియా వ్యాధిగ్రస్తులకు టబ్, మగ్, టవల్, సోప్, ఆయింట్‌మెంట్, పీసీఎం మాత్రలతో కూడిన కిట్లు పంపిణీ చేశామన్నారు.